## బీఆర్‌ఎస్‌లో చేరికలు

బోథ్, నవంబర్ 17: చింతల్‌బోరి గ్రామ సర్పంచ్ బుర్కె రేణుక, రాందాస్, ఇతర నాయకులు బీజేపీ పార్టీని వీడిని బీఆర్‌ఎస్‌లో చేరారు. శుక్రవారం బోథ్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎంపీపీ తుల శ్రీనివాస్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాందాస్ మాట్లాడుతూ బీజేపీ విధానాలు నచ్చక బీఆర్‌ఎస్‌లో చేరుతున్నామన్నారు. ఎంపీపీ శ్రీనివాస్, మాజీ ఎంపీ నగేశ్ సారథ్యంలో జాదవ్ అనిల్ గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్‌యాదవ్, అల్లకొండ ప్రశాంత్, జుగదిరావ్, ఇఫ్తేకర్, జిట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నేడు మండలంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రచారం

బోథ్, నవంబర్ 17 : బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ శనివారం బోథ్ మండలంలోని కన్గుట్ట, పట్నాపూర్, నిగిని, కంటెగాం, బాబెర, నక్కలవాడ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు బీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ ప్రచారానికి పార్టీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి



సిరిచెల్మలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌వో చాహత్ బాజ్‌పాయ్

ఇచ్చోడ, నవంబర్ 17 : అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని బోథ్ అసెంబ్లీ ఎన్నికల రిట్నరింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. ఇచ్చోడతో పాటు మాధపూర్, సిరిచెల్మ, సిరికొండ మండలంలోని సుంకిడి, సిరికొండలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎన్నికల రిట్నరింగ్ అధికారి చాహత్ బాజ్‌పాయ్ పరిశీలించారు. సౌకర్యాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌వోలు ఓటర్‌స్లిప్‌లను ప్రజలకు అందించాలని సూచించారు. అనంతరం సిరికొండలో ఓటు హక్కు పత్రాన్ని ప్రజలకు అందించారు. ఆమె వెంట ఇచ్చోడ తహసీల్దార్ తుకారాం, సిరికొండ ఆర్‌ఐ విలాస్, ఎంపీవో అతుల్ కుమార్, బీఎల్‌వోలు మౌనిక, రాణి ఉన్నారు.

## నిర్భయంగా ఓటు వేయాలి



తాంసిలో ఓటర్‌కు స్లిప్పు అందిస్తున్న తహసీల్దార్ లక్ష్మి

తాంసి, నవంబర్ 17: ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా, నిర్భయంగా ఓటు వేయాలని తహసీల్దార్ లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఓటింగ్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీ-విజిల్ యాప్ వినియోగం, ఈవీఎంపై ఓటు వేసే విధానాన్ని వివరించారు. అనంతరం ఓటర్లకు స్లిప్పులను పంపిణీ చేశారు. 20వ తేదీ లోపు ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేయాలని బీఎల్‌వోలకు సూచించారు. ఓటింగ్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ మహేందర్, జూనియర్ అసిస్టెంట్లు బాబురావ్, రాఘవేంద్ర, బీఎల్‌వోలు భాగిర్త, విజయలక్ష్మి, యువకులు సాయికుమార్, రాము, పోశన్న, దత్తు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి ఇంటిని నిర్మిస్తామని హామీ



ఖోడద్ బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు జ్ఞానేశ్వర్

తాంసి(తలమడుగు), నవంబర్ 17: ఖోడద్ గ్రామానికి చెందిన గంగన్న ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమై రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. శుక్రవారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సోదరుడు జ్ఞానేశ్వర్ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. గృహలక్ష్మి ఇల్లు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఆయన బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేశ్, సర్పంచ్ ఆనందరావ్, అభిరాం రెడ్డి, ఉపసర్పంచ్ మమతానారాయణ రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

# అండగా ఉంటా.. ఆదరించండి

- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్
- గుడిహత్నూర్ మండలంలోని గ్రామాల్లో ప్రచారం



గుడిహత్నూర్ : ప్రచారంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్

గుడిహత్నూర్, నవంబర్ 17 : నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటామని ఆదరించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్, తోయగూడ, తోషం, తోషంతండా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జాదవ్ అనిల్ ఆయా గ్రామాల్లో ప్రజలతో మమేకమయ్యారు. తనను గెలిపిస్తే ప్రజలకు సేవకుడిగా పని చేస్తానన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరువద్దన్నారు. ఎన్నికల సమయంలో అధికారం, పదవుల కోసం కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు నమ్మవద్దని మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి సీఎంగా కేసీఆర్‌ను చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు జీ తిరుమల్ గౌడ్, కుమ్రం శంభు, సింధే మీనా, జిల్లా, మండల నాయకులు సర్పే సోంబాయి, ఆడె శీల, రాము, తెలంగె మాధవ్, వెంకట్‌రావ్, ఎండీ గఫార్, తదితరులు పాల్గొన్నారు.

### జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం

బోథ్, నవంబర్ 17 : మండలంలోని కన్గుట్ట గ్రామంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టో గురించి వివరించారు.ఈ సందర్భంగా ఎంపీపీ తుల శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలను గుర్తించి వారిని గౌరవించి వయసుతో నిమిత్తం లేకుండా రూ.2016 నగదు ఇచ్చి ఆర్థిక భరోసాను కలిగిస్తుందని అన్నారు. భవిష్యత్‌లో మరింత అభివృద్ధి కోసం కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సర్పంచ్ రమేశ్, ఉప సర్పంచ్ రమేశ్, అల్లకొండ ప్రశాంత్, జుగాదిరావ్, విజయ్ పాల్గొన్నారు.

### రూ.400కే గ్యాస్ సిలిండర్ అందిస్తాం

తాంసి, నవంబర్ 17 : పేదలపై మోదీ సర్కారు మోపిన బండ భారాన్ని తగ్గించేందుకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కంకణం కట్టుకున్నారని ముచ్చటగా మూడోసారి అధికారం చేపట్టాక రూ.400కే గ్యాస్ సిలిండర్ అందజేస్తామని జడ్పీటీసీ తాటిపెల్లి రాజు అన్నారు. శుక్రవారం మండలంలో ఎంపీపీ శ్రీధర్ రెడ్డితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేశారు.

కారు గుర్తుకు ఓటు వేసి బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకన్న, సదానందం, బీఆర్‌ఎస్ నాయకులు కాంత్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ ధనుంజయ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

ఇచ్చోడ(సిరికొండ), నవంబర్ 17 : సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏ వర్గాన్ని విస్మరించకుండా సంక్షేమ ఫలాలను ప్రతి ఒక్కరికీ అందిస్తున్నదని మాజీ ఎంపీ నగేశ్ అన్నారు. శుక్రవారం సిరికొండ మండలంలోని గోధుమల్లే, నేరడిగొండ(జీ), నారాయణపూర్, ఫకీర్‌పేట్, రాజులగూడ గ్రామాల్లో ఇంటింటికీ బీఆర్‌ఎస్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసరా పింఛన్ రూ.2016 నుంచి రూ.5016 వరకు పెంచారని తెలిపారు. దివ్యాంగులకు రూ.4016 నుంచి రూ.6 వేలకు పెంచిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకే దక్కిందన్నారు. బోథ్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిరికొండ బీఆర్‌ఎస్ నాయకులు ఓరగంటి పెంటన్న, ఎండీ ఎక్బల్, తోకల చందు, సంతోష్, లక్ష్మణ్, భూమన్న, తులసీరాం, కన్నయ్య, గంగాధర్, కృష్ణకుమార్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.




ఇచ్చోడ : మాట్లాడుతున్న మాజీ ఎంపీ నగేశ్

## ప్రగతికి తొలిమెట్టు ప్రశ్న పోస్టర్ విడుదల


బోథ్, నవంబర్ 17 : మండల కేంద్రంలోని రైతు వేదికలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ప్రగతికి తొలి మెట్టు ప్రశ్న అనే పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ మాట్లాడుతూ జాతీయ శాస్త్రీయ దృక్పథం ప్రచారోద్యంలో భాగంగా ఈ నెల 7 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఇందులో జిల్లాలో బాల విజ్ఞాన మేళా, సైన్స్ జాతర, సైన్స్ ప్రదర్శనలు, కళాజాతా, పుస్తక ప్రదర్శనలు, మీరక్కల్ ఎక్స్పోజర్ లాంటి కార్యక్రమాలకు ప్రజలు, ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నరేశ్‌కుమార్, పోశెట్టి, శశిధర్ రెడ్డి, సచిన్, హనుమాండ్లు, రిసోర్స్ పర్సన్లు బైరి సతీశ్, శ్రీనివాస్ రెడ్డి, కమలాకర్, రాహుల శంకర్, విజయ్‌కుమార్, గంగారాం, మధుసూదన్, దీపక్, మెస్రం రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మంత్రి కేటీఆర్ చిత్రపటం బహూకరణ

ఉట్నూర్, నవంబర్ 17 : మంచిర్యాల జిల్లా జన్నారం మండలానికి వచ్చిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తారక రామారావుకు జడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ పుష్పగుచ్ఛం అందించగా, బీఆర్‌ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ కేటీఆర్ చిత్రపటాన్ని బహుకరించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ ఖానాపూర్ అభివృద్ధి కోసం జాన్సన్ నాయక్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. అత్యంత వెనుకబడిన ఖానాపూర్ నియోజకవర్గానికి అన్ని రకాలుగా నిధులు ఇచ్చి అభివృద్ధి చేస్తామన్నారు.



మంత్రి కేటీఆర్‌కు చిత్రపటం అందజేస్తున్న ధరణి రాజేశ్




మంత్రి కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న జడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్, రవీందర్‌రావు, పూర్ణచందర్